క్లుప్తంగా

సుమ పూజిత.. కుంకుమరాగ శోభిత



దుర్గాలమ్మ సోమవారం విశేష పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. పూర్ణామార్కెట్ వెలంపేటలో కొలువుదీరిన దుర్గాలమ్మ దేవస్థానంలో వార్షిక జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం అమ్మవారు సౌభాగ్య లక్ష్మిగా గాజుల అలంకరణలో దర్శనమిస్తారని ఉత్సవ కమిటీ తెలిపింది.

- డాబాగార్డెన్స్

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

చురుగ్గా ఓటరు జాబితా పరిశీలన



ఓటరు జాబితా పరిశీలిస్తున్న కర్రి నీలకంఠం, తదితరులు

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు పరిధిలో సోమవారం 33, 34, 35, 41 వార్డుల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం ఆధ్వర్యంలో ఓటరు జాబితా పరిశీలించారు. వార్డులో బంగారుమెట్ట, కంతంవారివీధి, గౌరీవీధి ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి జాబితా ప్రకారం ఓటర్లు నివాసాల్లో వున్నారో..? లేరో..? పరిశీలించారు. ఇళ్లు ఖాళీ చేసిన వారి ఓట్ల స్థానంలో కొత్తగా వచ్చిన వారి పేర్లు చేర్చేందుకు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల శ్రీహరిరెడ్డి, బొడ్డేటి ప్రసాద్, కొడమంచిలి శ్రీను, కణితి బ్రహ్మం, పిల్లి శివ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వైద్యానికి చేయూత



మోహన్‌కృష్ణకు నగదు అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు, కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం : జర్నలిస్టులకు అన్ని విధాలా అండగా ఉంటామని జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, జాతీయ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ న్యూస్ ఛానల్ రిపోర్టర్ నడిపిల్లి మోహన్‌కృష్ణకు వైద్య ఖర్చుల నిమిత్తం సోమవారం రూ.50 వేలు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం సుమారు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని, దాతలు ముందుకు రావాలని కోరారు. ఇస్మాయిల్, ఇరోతి ఈశ్వరరావు, ప్రభాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ. లక్ష

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం ద్వారకా తిరుమలకు చెందిన పి.ఈశ్వర సాయి రామకృష్ణ అనే దాత లక్ష 116 విరాళం నగదు రూపంలో ఈవో శ్రీనివాస మూర్తికి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు బాండ్ అందజేసి స్వామి దర్శనం కల్పించారు. ఏఈవో పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డుకు లైన్ క్లియర్

- పనులకు అడ్డుగా ఉన్న నిర్మాణాల తొలగింపు
- ఇసుక కొండ సత్యదేవుని ఆలయానికి మార్గం సుగమం



బాబాజీకొండ ఘాట్ రోడ్డు



ఘాట్‌రోడ్డుకు అడ్డంకిగా ఉన్న నిర్మాణాన్ని తొలగించిన దృశ్యం

డాబాగార్డెన్స్: సత్యదేవుని దర్శనానికి మార్గం సుగమం కానుంది. ఇసుకకొండపై కొలువుదీరిన రమా సహిత సత్యనారాయణ మూర్తి ఆలయానికి ఘాట్‌రోడ్డు పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఘాట్‌రోడ్డు నిర్మించేందుకు అడ్డంకిగా మారిన నిర్మాణాలను తొలగించడంతో పనులు ముమ్మరం కానున్నాయి. అన్నవరం తర్వాత అంతటి ప్రాధాన్యతను సంతరించుకున్న ఇసుకకొండ (బాబాజీ కొండ)పై రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయానికి జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అనేక మంది భక్తులు వస్తుంటారు. ప్రత్యేకంగా పౌర్ణమి రోజున వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. అయితే, ఇంతటి ప్రాచుర్యం పొందిన సత్యదేవుని ఆలయానికి సరైన మార్గం లేక భక్తులు అవస్థలు పడేవారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా ఘాట్‌రోడ్డు నిర్మాణపనులను ప్రారంభించారు. దాదాపు రెండేళ్లకు పైగా సాగిన ఈ ఘాట్‌రోడ్డు పనులు అనివార్య కారణాల వల్ల ఏడాదిగా నిలిచిపోయాయి. కేవలం 25 నుంచి 50 మీటర్ల ఘాట్‌రోడ్డు పనులు ఏడాదిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో, జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ రాణిబొమ్మ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇసుకకొండ ఘాట్‌రోడ్డుకు ఇంతవరకు పూర్ణామార్కెట్ దయారామ్ స్వీట్ స్టాల్ వద్ద అడ్డంకిగా ఉన్న నిర్మాణాలు తొలగించారు దీంతో, ఘాట్‌రోడ్డు పనులకు లైన్ క్లియర్ అయినట్లయింది.

ఆ కష్టాలకు ఇక చెక్

గతంలో సత్యదేవుని ఆలయానికి వెళ్లాలంటే కేజీహెచ్ మార్చురీ మీదుగా శవాలను దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. మరోవైపు ఏవీఎన్ కళాశాల వైపు ఉన్న ఏఎంసీ గేట్ కూడా కొంత ఇబ్బందిగా ఉండేది. ఘాట్ రోడ్డు అందుబాటులోకి వచ్చేస్తే రాకపోకలకు మార్గం సుగమం అయినట్లే. అలాగే.. సాయంత్రం 5 గంటలైతే చాలు సత్యదేవుని ఘాట్ రోడ్డు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా ఉండేది. ఓ వైపు మందుబాబులు.. మరోవైపు ప్రేమికులతో అటుగా వెళ్లేందుకు భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఘాట్‌రోడ్డు అందుబాటులోకి వస్తే అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పడినట్లే అని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఘాట్‌రోడ్డు పనులను ఇటీవల ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, పలువురు జీవీఎంసీ అధికారులతో పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.



నిలిచిపోయిన పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మేరీజోన్స్, మాసిపోగు రాజు

అడ్డంకులను అధిగమించి..



స్వామి ఆలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డు పనులకు ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయి. ఎంతో మంది ఎన్నో అడ్డంకులు సృష్టించారు. అయినా భక్తుల శ్రేయస్సు దృష్ట్యా జీవీఎంసీ నుంచి రూ.కోటి 20 లక్షల నిధులు మంజూరు చేయించి, మాజీ కార్పొరేటర్ జామిశెట్టి సన్యాసిరావు వారసులతో మాట్లాడి సుమారు 170 గజాల స్థలాన్ని వారు జీవీఎంసీకి ఉచితంగా ఇప్పించే ప్రయత్నం చేశాం. పనుల ప్రారంభానికి జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్, శానిటేషన్, ఆర్కిటెక్చర్ విభాగం అధికారులతో మాట్లాడాం. ఎట్టకేలకు పనులు త్వరలోనే పూర్తవుతున్నాయి. అనంతరం ప్రముఖులతో ఘాట్‌రోడ్డు ప్రారంభిస్తాం.

– మాసిపోగు మేరీజోన్స్, 36వ వార్డు కార్పొరేటర్

ఘాట్‌రోడ్డు త్వరలో ప్రారంభిస్తాం



ఎంతో ప్రసిద్ధి గాంచిన సత్యనారాయణస్వామి ఆలయానికి జగనన్న ప్రభుత్వ పాలనలో మహర్దశ పట్టనుంది. ఘాట్‌రోడ్డు అందుబాటులోకి వస్తే భక్తుల తాకిడి మరింత పెరుగుతుంది. సుమారు రూ.11 కోట్లతో కిలోమీటర్ పొడవునా ఘాట్ రోడ్డు అందుబాటులోకి వస్తే భక్తులు పూర్ణామార్కెట్ నుంచి నేరుగా దేవాలయానికి చేరుకోవచ్చు. ఘాట్‌రోడ్డు పనులు పూర్తి చేసి త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్యే

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి



తన బంగ్లా నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగరంలో కాలుష్యం తగ్గించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సోమవారం ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో – వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు అనేక చర్యలు చేపడతున్నామన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

14న దుకాణాలకు వేలం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్ – 4 పరిధిలో గల పలు దుకాణాలు అద్దెకు ఇచ్చేందుకు, మార్కెట్లలో ఆశీలు వసూలుకు ఈ నెల 14న వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. 31వ వార్డు డైక్స్‌ట్యాంక్, జగదాంబ, సూర్యాబాగ్, 35వ వార్డు పాత బస్టాండ్ ఫేజ్ – 2, 39వ వార్డు పద్మానగర్ వాణిజ్య సముదాయాలు, 37వ వార్డు అంబేడ్కర్ కల్యాణ మండపం అద్దెకు ఇచ్చేందుకు, 35వ వార్డు సర్దార్ వల్లభాయి పటేల్ (పూర్ణా మార్కెట్) మార్కెట్, రామకృష్ణా రైతుబజార్, రెల్లివీధి ఫిష్‌మార్కెట్ ఆశీలుకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు చెప్పారు. పైన పేర్కొన్న వాణిజ్య సముదాయాల్లో గల దుకాణాలు, కల్యాణ మండపం, 3 మార్కెట్లకు మూడేళ్ల కాలపరిమితికి కాంట్రాక్టు ఇచ్చేందుకు ఆ రోజు ఉదయం 11 గంటలకు జోన్ – 4 జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు/సంస్థలు వేలం పాటలో నిబంధనలకు లోబడి పాల్గొనాలని పేర్కొన్నారు.

అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రవేశం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి

డాబాగార్డెన్స్: ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో సోమవారం వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ' కెరీర్ ఆపర్చునిటీ ఫర్ వుమెన్ ఇన్ ఇండియన్ నేవీ' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో స్త్రీ ప్రవేశించలేని రంగమంటూ ఏదీ లేదన్నారు. ఇండియన్ నేవీలో చేరి, దేశ సేవలో మాతృభూమి రుణం తీర్చుకోవాలని విద్యార్థినులకు సూచించారు. లెఫ్టినెంట్ కమాండర్ ఆఫ్ ప్రిన్సిపల్ మెడికల్ ఆఫీసర్ అశ్వతీసుందరం మాట్లాడుతూ పదేళ్ల తర్వాత ఎలా వుండాలో విద్యార్థి దశలోనే నిర్ణయించుకుని, ఆ మేరకు కృషి చేయాలని సూచించారు. నేవీలోకి ప్రవేశించి మహిళా శక్తిని నిరూపించుకోవాలని చైతన్యపరిచారు. వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ కేవీఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు నేవీలో ఉపాధి పొంది పలువురికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

- నిలిచిన ట్రాఫిక్



జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా నిలిచిన ట్రాఫిక్

సీతమ్మధార: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా బయట రోడ్డుపై వాహనాలను పార్క్ చేయడంతో సోమవారం సుమారు అరగంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అసలే చిన్న రోడ్డు.. ఆపై వందల సంఖ్యలో బస్సులు, కార్లు ఇరువైపులా నిలిపివేయడంతో ట్రాఫిక్ జటిలంగా మారింది. దీంతో పాదచారులు, వాహనదారులకు మధ్య ఘర్షణ జరిగింది. వాహనాలను పార్క్ చేయడానికి స్థలం లేకపోవడంతో వాహన చోదకులు ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారు. పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలువురు విమర్శిస్తున్నారు. సమస్య ఉన్నా పోలీసులు గానీ, జీవీఎంసీ అధికారులు గానీ చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పీతల మూర్తి తీరుపై నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సంత వ్యాపారులు

సీతమ్మధార : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ కళాభారతి రోడ్డులో కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తొలగించిన సంతను, తోపుడు బళ్ల వ్యాపారులను కొనసాగించాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కోశాధికారి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీతల మూర్తి తీరుకు నిరసనగా వ్యాపారులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా 200 కుటుంబాలు తోపుడు బళ్లపైన, నేలపైన వ్యాపారులు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. అటువంటి నిరుపేద వ్యాపారులను జనసేన కార్పొరేటర్ మూర్తి కక్ష కట్టి తొలగించడం దారుణమన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా కళాభారతి మార్గంలో వారం సంతను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మూర్తి మొండి వైఖరి వీడకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కె.కుమారి, చందు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు



అధికారులతో చర్చిస్తున్న ధర్మకర్తల మండలి చైర్మన్ సర్వేశ్వరరెడ్డి, ఈవో రమాబాయి

సీతమ్మధార: దొండపర్తిలోని ఎరుకమాంబ ఆలయంలో ఈ నెల 8న మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానంలో సీతమ్మధార అర్బన్ కార్యాలయ తహసీల్దార్ శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వివిధ విభాగాల అధికారులతో సోమవారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు అమ్మవారి దర్శనాలు సులభంగా జరిగేలా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ సరఫరా చేయాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతిభద్రతలు, పరిశుభ్రతా చర్యలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.ఎ.త్రినాథరావు, ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ గంగాధర్, ఫైర్ స్టేషన్ హెచ్‌సీ గోవిందరావు, శాంతిభద్రతల విభాగం పీసీ రవికుమార్, జీవీఎంసీ ఏఎంహెచ్‌వో సునీల్ కుమార్, ఆర్ఐ ఇబ్రహీం, దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.వి.రమాబాయి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ డి.వి.సురేష్‌బాబా, ధర్మకర్తల మండలి చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ధర్మకర్తలు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

11న మేజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట : విశాఖ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 6న కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయిన అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం, రూడకోట పంచాయతీ, బడంబీరు గ్రామానికి చెందిన కోడ పోతన్న మరణాన్ని లాకప్ డెత్‌గా పరిగణించి మేజిస్టీరియల్ విచారణకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 11న విశాఖ కలెక్టరేట్‌లోని ఆర్‌డీవో కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నట్లు ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. కోడ పోతన్న సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో అనారోగ్యానికి గురయ్యారని, ఫిబ్రవరి 6న చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా, అదే రోజు మధ్యాహ్నం మృతి చెందాడని వివరించారు. పోతన్న మరణానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు విచారణకు హాజరై లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆర్‌డీవో కోరారు.

'ఐడియల్ గంధర్వ' లోగో ఆవిష్కరణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటుడు సుమన్ తదితరులు

డాబాగార్డెన్స్: ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు, ఘంటసాల స్మారక పీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్ చంద్ర ఆధ్వర్యంలో ఐడియల్ గంధర్వ లోగో ఆవిష్కరణ జరిగింది. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్, జి.దాము లోగోను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో పలువురు గాయనీ గాయకులు ఘంటసాల ఆలపించిన తెలుగు సినీగీతాలను మధురంగా ఆలపించారు. అమెరికాకు చెందిన అంతర్జాతీయ స్థాయి స్వరపోషకుడు జి.రాముకు జీవిత సాఫల్య పురస్కారాన్ని నటుడు సుమన్ చేతుల మీదుగా అందజేశారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి ధ్వని అనుకరణతో ప్రేక్షకుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో ఘంటసాల స్మారక పీఠం స్వరపోషకుడు ఎమ్మెస్ రాజు, వంకాయల సన్యాసిరాజు, ఎన్ఆర్ఐ కె.సుధారాణి, ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యశర్మ, ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, పి.నాగేశ్వరరావు, మెలోడి సత్యనారాయణ, కందర్ప రాధ, న్యాయ నిర్ణేతలు, నిర్వాహకులు, కళాభిమానులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ధర్నా

సీతమ్మధార : వీవోఏల మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం సభ్యులు సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ బకాయిలు చెల్లించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. పొదుపు మహిళలకు రూ.20 లక్షల వరకూ జీరో వడ్డీ రాయితీ వర్తింపజేయాలన్నారు. గుర్తింపు కార్డు, యూనిఫామ్ ఇవ్వాలని, గ్రామ సంఘాల నుంచి బకాయిలు చెల్లించాలని కోరారు. పి.అప్పయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీత ధారణ చేస్తున్న అర్చకుడు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడ సేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండిగరుడ వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

అల్లిపురం: యాంకర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై టూటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన యాంకర్ శాంత్రో నగరంలో ఒక కార్యక్రమానికి యాంకరింగ్ నిమిత్తం వచ్చారు. ఆమె అల్లిపురంలోని ఓ హోటల్‌లో బస చేశారు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఈవెంట్ మేనేజర్ మహాతో ఆమె గదికి వచ్చి మాట్లాడుతూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



బ్రీత్ ఎన్‌లైజర్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది

సీతమ్మధార: మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. గురుద్వారా, ఆశీలమెట్ట తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ద్వారకా ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురు యువకులను గుర్తించి బ్రీత్ ఎన్‌లైజర్ టెస్టులు చేశారు. అధిక మోతాదులో మద్యం తాగిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కరరావు మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాన్ని నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉండాలని, లేనిపక్షంలో జరిమానా విధించి, చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు ఎవరూ వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

విమ్స్‌లో ఉచిత వైద్య శిబిరం రేపు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఈ నెల 6న ఉచిత ప్లాస్టిక్ సర్జరీ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ బ్లాక్‌లో ఏర్పాటు చేయనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణం మొర్రి, డయాబెటిక్ ఫుట్, పురుషులలో రొమ్ము గ్రంధి పెరుగుదల, బోదకాలు, కిలాయిడ్ చికిత్సలు, కాలిన గాయాలు, విరిగిన చేతులు, కాళ్లు, వాస్క్యులర్ సమస్యలకు ఈ శిబిరంలో వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ప్లాస్టిక్ సర్జరీ, కాస్మోటిక్ సర్జరీలకు సంబంధించిన చికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా రూ.6 వేలు ఖరీదైన కలర్ డాప్లర్, ఎక్స్‌రే, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం

సీతంపేట: బహుజనుల రాజ్యాధికారమే బహుజన సమాజ్‌పార్టీ మ్యానిఫెస్టో అని, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తోందని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర సమన్వయకర్త, మాజీ ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రా జిల్లాలు బహుజన జిల్లాలని, రాష్ట్రాన్ని ఏలే రెండు కులాలకు సంబంధం లేని జిల్లాలని పేర్కొన్నారు. లకే రాజారావు ఆదర్శవంతమైన నాయకుడని, ఆయనే అందరికీ స్ఫూర్తి అని అన్నారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తున్న బీఎస్పీని అభ్యర్థులను బహుజనులంతా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, రాష్ట్ర కార్యదర్శి కదిరి రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తిరుపతిరావు, ప్రకాష్, శివప్రసాద్ పాల్గొన్నారు.

7న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 7వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. హీరో మోటర్స్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థల్లో 140 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తిరుపతిలో జాబ్ చేయాలన్నారు.